క్లుప్తంగా

దత్తాత్రేయుడికి క్షీరాభిషేకం



పందలపాకలో దత్తాత్రేయునికి పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో మంగళవారం దత్తాత్రేయుని జయంతిని పురస్కరించుకుని స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఉన్న దత్తాత్రేయుడికి క్షీరాభిషేకం చేశారు. అర్చకులు గరిమెళ్ళ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తుల కోసం అన్నసమారాధన చేశారు.

అన్ని వర్గాల సంక్షేమానికి రంగా కృషి



కాపవరంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

బిక్కవోలు: అన్ని వర్గాల సంక్షేమానికి దివంగత వంగవీటి మోహన్‌రంగా కృషి చేశారని సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని కాపవరంలో వంగవీటి రంగా 35వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారెళ్ళ భీష్ముడు, నిడదవోలు శ్రీను, రాధ రంగా మిత్ర మండలి అధ్యక్షుడు సత్యంశెట్టి ఉమామహేష్, కొట్టు వీరబ్బాయి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వినతి

సీతానగరం: పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సర్వేశ్వరమూర్తికి మంగళవారం మండల ఆశా వర్కర్లు అందించారు. ముందుగా అంగన్‌వాడీ వర్కర్లకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం సీతానగరం బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

రైతులకు రిబేటు జమ

సీతానగరం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని ఖాతాదారులైన రైతులకు రిబేటు నగదు వారి ఖాతాలలో జమ చేసినట్టు పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వీరభోగ వసంతరావు, సీఈవో ఎన్.లక్ష్మణ మంగళవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2021 –22కు గాను మూడుశాతం రిబేటును అందించిందన్నారు. సంఘంలోని 309 రైతులకు రిబేటుగా రూ.13.06 లక్షలు వచ్చిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్లు మట్ట సుబ్బారావు, చిరికి రమణ, రైతులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు

మధురపూడి: కాపవరం బైబిల్ మిషన్ ఆవరణలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎం.ఎలియాజర్ మాట్లాడుతూ పాపుల రక్షణార్థమై దివి నుంచి భువికి క్రీస్తు ప్రభువు వచ్చారన్నారు. క్రైస్తవులంతా సహోదర ప్రేమను సమాజానికి పంచాలన్నారు. డాక్టర్ నక్కా ఆనంద కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీతానగరం మండలం మిర్తిపాడు స్వస్థతశాల అధినేత ఎన్‌జీ ఆనందపాల్, యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్రా ప్రసాద్, ముఖ్యసలహాదారుడు ఒరిగేటి ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

పౌర్ణమి చంద్రునికి హారతులు



కరకుదురులో పౌర్ణమి చంద్రునికి హారతులిస్తున్న మహిళలు

పెదపూడి: మండలంలోని కరకుదురులో విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి చంద్రునికి మహిళలు హారతులిచ్చి పూజలు చేశారు. అమ్మవారికి ఆధ్యాత్మిక భజన భక్తిగీతాలు ఆలపించారు. ప్రతీ శుక్రవారం ఆలయంలో అన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల కారణంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, గంగంపాలెం, ఠాకూరుపాలెం, సూదికొండ, జగన్నాథపురం, శివరామపట్నం, మల్లవరం, భూపతిపాలెం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆడేద్దాం.. ఆనందంగా..

- ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సూర్యనారాయణరెడ్డి



ముగ్గళ్లలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న తదితరులు



దివాన్ చెరువులో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



క్రీడాకారులకు క్రీడా సామగ్రితో కూడిన కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



మిర్తిపాడులో పాల్గొన్న ఎంపీటీసీ దేవి, పార్టీ నాయకులు



నర్సాపురంలో వాలీబాల్ పోటీలు



జి.మామిడాడలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కేతా తులసి



దొంతమూరులో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రమణ



బిక్కవోలులో క్రికెట్ ఆడుతున్న జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి

రాజానగరం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి, వారిలోని ప్రతిభను ప్రోత్సహించడం కోసమే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులోని ప్రజా పరిషత్ స్పెషల్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ప్రారంభమైన ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్, షటిల్ క్రీడలను వారితో కలిసి కొద్దిసేపు ఆడుతూ సందడి చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి 26,861 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం హర్షణీయమన్నారు. ఇదే కార్యక్రమంలో గ్రామస్తులలో అర్హులైన వారికి హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, కోలపాటి వెంకన్న, పలివెల స్వామి, యర్రంశెట్టి ధర్మరాజు, వల్లభశెట్టి, వేమగిరి విజయ, అయినవిల్లి ప్రశాంతి, బండి నారాయుడు, వనపర్తి ఏసు, తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో సందడి

మధురపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం మంగళవారం కోరుకొండ మండలంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా బూరుగుపూడి, కణుపూరు, కోరుకొండ, గాదరాడ గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. కణుపూరులో పోటీలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం యువతను ప్రోత్సహిస్తూ, ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతోందని అభినందించారు. బూరుగుపూడిలో వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్‌తేజ క్రీడా పోటీలను ప్రారంభించారు. మండలంలోని 24 గ్రామ సచివాలయాల పరిధిలో 8,583 మంది క్రీడాకారులు తలపడనున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, నాయకులు అరిబోలు చినబాబు, సూరిశెట్టి కుటుంబరావు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, మద్దాల రమణ, కళ్యాణం అప్పారావు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

సీతానగరం: ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దామని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. ముగ్గళ్లలో పోటీలను పార్టీ నాయకులు ఆళ్ల కోటేశ్వరరావు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, కూచిపూడి బాబ్జీతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించి, మెరుగైన క్రీడా ప్రమాణాలను అందించేందుకు ఉద్దేశించిన క్రీడా మహోత్సవాన్ని విజయవంతం చేద్దామన్నారు. మిర్తిపాడులో ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ నాయకులు ఏక రాజు, జొన్నలగడ్డ సత్యనారాయణ, మాకిరెడ్డి సాయి కల్యాణ్ ప్రారంభించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

అనపర్తి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రితో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసిసురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ పెదకాపు పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల వద్ద ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీలకు వలంటీర్లు దూరంగా ఉన్నారని ఒక పత్రికలో తప్పుడు వార్తలు రాస్తున్నారన్నారని, అయితే వలంటీర్ల సహకారంతోనే పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఉప సర్పంచ్ డాక్టర్ జంగా మురళీ కృష్ణారెడ్డి, ఎంఈఓ సీహెచ్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు. పందలపాక ఉన్నత పాఠశాల వద్ద ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభించారు.

రంగంపేట: ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమం మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో పండగలా ప్రారంభమైంది. జి.దొంతమూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ గోలి రమణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌరీశాంతి, పీఈటీ లక్ష్మి పాల్గొన్నారు.

పెదపూడి: జి.మామిడాడలో ఎంపీపీ కేతా తులసి, కాండ్రేగుల గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సంపరలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. జి.మామిడాడలో ఎంపీపీ కేతా తులసి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా ద్వారా గ్రామాల్లోని ఆణిముత్యాలను వెతికి దేశానికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ వీవీ సాయిబాబు, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం



వేండ్రలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వేండ్రలో 185 మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

పెదపూడి: పేదల సొంతింటి కల నేరవేర్చడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేండ్రలో మంగళవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, చింతపల్లి సర్పంచ్ కొల్లు లోవకుమారి అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేండ్ర, చింతపల్లి గ్రామాలకు సంబంధించి 185 మందికి విలువైన ఇళ్ల స్థలాలు పట్టాలుగా పంపిణీ చేశామన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో 32లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువా కప్పి, గజమాల వేసి వేంకటేశ్వరస్వామి ఫొటో బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత చింతా దొరబాబు ఎంపీటీసీ సభ్యుడు త్రిమూర్తులు, పైన సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, సొసైటీ ప్రతినిధి పేపకాయల సూర్యనారాయణ(డీటీఎస్), వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ నర్ల సాంబమూర్తి, వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్న బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ మోర్త శ్రీను, పార్టీ గ్రామ కన్వీనర్ ఎస్.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లికి చెందిన మైలపల్లి రాజశేఖర్ (27) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్‌ను మద్యం తాగొద్దని ఈనెల 4న తల్లి రామలక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్య సేవలకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఇస్మాయిల్‌ను సత్కరిస్తున్న సభ్యులు

అనపర్తి: మండలంలోని పొలమూరు, అనపర్తి, రామవరం, పీరారామచంద్రపురం, దుప్పలపూడి గ్రామాల పరిధిలోని సుమారు 250 ముస్లిం మైనార్టీ కుటుంబాలు అనపర్తి మండల ముస్లిం మైనార్టీ సంఘంగా ఏర్పడ్డారు. దీంతో సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించి మంగళవారం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా షేక్ ఇస్మాయిల్, గౌరవాధ్యక్షుడుగా అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షులుగా షేక్ సల్మాన్, షేక్ సిలార్ సాహెబ్, కార్యదర్శిగా షేక్ మాబూ సుభానీ, సంయుక్త కార్యదర్శులుగా షేక్ సూరా సాహెబ్, షేక్ మీరా సాహెబ్, కోశాధికారిగా షేక్ అమీర్‌లను ఎన్నుకున్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- దివాన్‌చెరువులో గడప గడపకూ..



దివాన్ చెరువులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన నవరత్నాల పథకాలు లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఇంకనూ వారు ప్రభుత్వం ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన ప్రభుత్వం తమదని సగర్వంగా చెప్పగలుగుతున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజానీకానికి ఎప్పుడు ఏం కావాలో తెలిసున్న నేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకనే ఆయన అందిస్తున్న పాలన ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, కోలపాటి వెంకన్న, పలివెల స్వామి, యర్రంశెట్టి ధర్మరాజు, గ్రంధి నానబ్బులు, వల్లభశెట్టి, వేమగిరి విజయ, అయినవిల్లి ప్రశాంతి, బండి నారాయుడు, వనపర్తి ఏసు తదితరులు పాల్గొన్నారు.

కణుపూరు శివాలయం గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులోని భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె కణుపూరులో స్వామివారిని దర్శించుకున్నారు. కొండపైకి జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొండపైకి సొంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 70 శాతం అయ్యాయని, మిగిలిన పనులు శివరాత్రి నాటికి పూర్తి చేస్తామన్నారు. టీటీడీ, శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులతో ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో కణుపూరు సర్పంచ్ కళ్యాణం రమణ, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్డి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్యాణం చిట్టిబాబు, కళ్యాణం రాంబాబు పాల్గొన్నారు.


'ధాత్రి ట్రస్ట్' సేవలు ప్రశంసనీయం



రామవరం ప్రభుత్వాసుపత్రికి ట్రస్ట్ ద్వారా సమకూర్చిన వైద్య పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ధాత్రి ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు సురేష్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం రామవరంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా సురేష్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సురేష్‌రెడ్డి గ్రామంలో ఎంతో మందికి కంప్యూటర్ టెక్నాలజీలో మెళకువలు నేర్పుతూ అందరి మన్ననలు పొందారన్నారు. సురేష్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా వివిధ సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో తన తనయుడిని సజీవంగా నిలిపేందుకు గాను కృష్ణారెడ్డి చేపడుతున్న సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ ద్వారా 300 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అధునాతన ఆపరేషన్ టేబుల్, పేషెంట్ల బెడ్స్, ఏసీ, వాటర్ కూలర్ మొత్తంగా రూ.4 లక్షల విలువైన వస్తువులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, సర్పంచ్ గిరడా గంగాభవాని, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి



గురుచరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్త జయంతి మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఇక్కడ కొలువైవున్న దత్తాత్రేయునితో పాటు తొలుత గణపతికి, సరస్వతీమాతకు, సాయిబాబాకు చక్రద్వారబంధానికి చెందిన భాస్కరరావు దంపతులచే పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాయిభక్త మండలి ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణ చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్న సమారాధన జరిగింది. దత్త జయంతిని పురస్కరించుకుని షిరిడీ తరహాలో భక్తులే బోయీలుగా గ్రామంలోని పురవీధులలో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.15 గంటల వరకు సాయిపల్లకీ ఉత్సవం కన్నుల పండుగగా సాగింది.

పీఆర్‌టీయూ స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడిగా యర్రా



యర్రా అగ్నేశ్వర్రావు

రాజానగరం: మండలంలోని వెలుగుబంద ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యర్రా అగ్నేశ్వర్రావు ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలో మంగళవారం జరిగిన పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్‌లో ఈ ఎన్నిక జరిగింది. అలాగే జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.రాజారావు, శ్రీనివాసరావు ఎంపికయ్యారు.

అధికారులకు సత్కారం

మధురపూడి: కోరుకొండలో వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సత్కారం జరిగింది. భక్తులకు భోజనం, వసతి, ఇతర సదుపాయాలు కల్పించిన తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావును, అలాగే విద్యుత్ శాఖ డీఈఈ చిట్టిరాజు, ఏఈ మదర్సా తదితరులను వారి కార్యాలయంలో సత్కరించారు. ముందుగా కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు నీరుకొండ బాబ్జి, ఉల్లి కాశీ విశ్వనాథ్, కోలా వీరేష్ కుమార్, బదిరెడ్డి దొర, కేతినీడి అశోక్, ఒంటిపల్లి సత్యనారాయణ, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ



రాపాకలో దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న రంగా యూత్ సభ్యులు

సీతానగరం: వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా రాపాక గ్రామంలో మంగళవారం పేదలకు దుప్పట్లు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. వంగవీటి మోహనరంగా యూత్ సభ్యులు అలుగుల చిట్టి వీరన్న, సూదా భాస్కర్ నాయుడు, ముత్యాల మహేష్, సుంకర సన్నీ, మైలవరపు కుమార్ రాజా, సూదా హేమ చరణ్, అలుగుల చిన్ని, కలగ రఘు తదితరులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వంద మంది వృద్ధులకు దుప్పట్లు, పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.